క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలసిన పాపారాయుడు



తాడేపల్లిలో వైఎస్ జగన్‌తో పాపారాయుడు

కపిలేశ్వరపురం (మండపేట): మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో బుధవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు కలిశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, తదితర అంశాలను వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు పాపారాయుడు తెలిపారు. జగన్‌ను కలిసిన వారిలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్ ఉన్నారు.

కూటమి ప్రభుత్వ తీరు అప్రజాస్వామికం

కపిలేశ్వరపురం (మండపేట): ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు షర్మిలను పోలీసులు గృహ నిర్బంధం చేయడం అప్రజాస్వామికమని ఏపీ రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ కామన ప్రభాకరరావు ఖండించారు. అమరావతి రాజధాని ప్రాంతంలో పర్యటించేందుకు బయలుదేరిన షర్మిలకు మహిళగా ఇవ్వాల్సిన గౌరవం కూడా ఇవ్వకుండా నిర్బంధించడం కూటమి ప్రభుత్వ దుర్మార్గానికి ప్రతీక అన్నారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలంటూ రిలే దీక్ష



కేశవరంలో దీక్ష చేస్తున్న వల్లూరి శ్రీవాణి

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం డి.కేశవరంలో పాఠశాలకు రక్షణ గోడ నిర్మించాలని కోరుతూ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త వల్లూరి శ్రీవాణి 13 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మిస్తే విద్యార్థుల సమస్యలు తీరడంతో పాటు పలు ప్రయోజనాలు కలుగుతాయన్నారు. తన డిమాండ్‌ను పరిష్కరించకుండా దీక్షను భగ్నం చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా ప్రతిఒక్కరూ తన దీక్షకు మద్దతు పలకాలని కోరారు.

రైతు బజార్ పరిశీలన

కపిలేశ్వరపురం (మండపేట): పట్టణంలోని రైతు బజార్‌ను బుధవారం ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సందర్శించారు. వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలను అందించడంతో పాటు నిబంధనలు మేరకు ధరలను నిర్దేశించేలా చర్యలు తీసుకోవాలని రైతుబజార్ ఎస్టేట్ ఆఫీసర్ బోళ్ల సతీష్‌ను ఆదేశించారు.

కోతుల సంచారాన్ని నిరోధించాలి



శీల గ్రామ వీధుల్లో గృహవాసాల మధ్య సంచరిస్తున్న కోతులు

కాజులూరు: మండలంలోని శీలలో ఇటీవల కోతులు గుంపులు, గుంపులుగా సంచరిస్తూ స్థానికులను, రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నాయి. గ్రామవీధుల్లో అవి హల్‌చల్ చేస్తుంటే స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కొబ్బరిచెట్ల నుంచి కాయలు, పిందెలను తుంచి పారవేయడంతో తమకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని రైతులు వాపోతున్నారు. గ్రామవీధుల్లో సంచరిస్తూ ఇళ్లపై అవి పరుగులు తీస్తుండటంతో తాటాకిల్లు, పెంకుటిళ్ల పైకప్పులు జారిపడుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు, మహిళలు, ఇంటిలో నుంచి బయటకు రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు. కోరంగి అభయారణ్యం దగ్గర కావటంతో అక్కడి నుంచి కోతుల గుంపులు గ్రామానికి చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి కోతుల సంచారాన్ని నిరోధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 333/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. ఆర్యావటం ఎస్ఎస్ హెచ్‌క్యూ ఫీడర్ పరిధిలోని కాజులూరు మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, బందనపూడి, మతుకుమిల్లి, తర్లంపూడి, చీకట్లవారిపేట, చేదువాడ, డేగలపేట, కరప మండలంలోని కొంగోడు, గొర్రిపూడి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

కందిపప్పు ఈసారైనా ఇచ్చేనా!

- జనవరి నుంచి నిలిచిపోయిన సరఫరా
- రాను రాను తగ్గిపోతోన్న నిత్యావసర సరకులు
- మే నెలలోనైనా పంపిణీ చేస్తారన్న ఆశతో నిరుపేదలు



రామచంద్రపురంలో మినీ ట్రక్కు ద్వారా ఇంటి వద్ద బియ్యం పంపిణీ చేస్తున్న సిబ్బంది

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి కుటుంబాలకు పౌర సరఫరాల శాఖ ద్వారా అందజేసే నిత్యావసరాలు ఎంతో ఆధారం. ఒకటో తేదీ వచ్చిందంటే కనీస మాత్రంగానైనా సరకులు ఇస్తే ఆ పేద కుటుంబం నెలంతా ఎంతో కొంత ఆనందంతో గడుపుతుంది. పేదలకు కనీసం ఆహారాన్ని సరఫరా చేయడం ప్రభుత్వం బాధ్యత. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ బాధ్యత నుంచి తప్పుకొంటుందని పించేలా సరకుల పంపిణీ తీరు ఉంది. రాను రానూ సరుకుల పంపిణీ తగ్గిపోతూ వస్తుండటంతో సామాన్య ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మే నెలలోనైనా కందిపప్పు సరఫరా చేస్తారన్న ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఇంటికే నిత్యావసర సరుకులు అందజేసిన గత ప్రభుత్వం...

రాష్ట్రంలో 2021 జనవరి 21న అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇంటింటికీ నిత్యావసరాలు పంపిణీ పథకాన్ని ప్రారంభించారు. వాహనాలన్నీ క్షేత్ర స్థాయికి చేరుకోగానే ఫిబ్రవరి ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 12 పట్టణాల్లో ప్రారంభమైంది. పంచాయతీ ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యంగా 23న గ్రామాల్లో ప్రారంభమైంది. నాలుగేళ్లగా పేదలకు సరకుల పంపిణీ దిగ్విజయంగా కొనసాగుతుంది. కూటమి ప్రభుత్వం వాహనాలను నిలిపివేసేందుకు దాదాపు నిర్ణయించినట్టు పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ వ్యాఖ్యలు స్పష్టం చేశాయి. మండపేట నియోజకవర్గంలో 147 షాపుల పరిధిలో 65 వాహనాలు ద్వారా 85,894 కుటుంబాలకు సరుకులను పంపిణీ చేస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 146 షాపుల పరిధిలో 54 వాహనాల ద్వారా 77,843 కుటుంబాలకు అందజేశారు.

కందిపప్పు ముట్టుకొంటే ఒట్టు..

పౌరసరఫరాల సంస్థ ద్వారా పేదలకు అందజేసే నిత్యావసర సరుకులు రాను రానూ తగ్గిపోతూ ఉన్నాయి. ఒక్కోసారి ఎప్పుడూ ఇచ్చే బియ్యంతో సరిపెడుతున్నారు. వాస్తవానికి బియ్యంతో పాటు కందిపప్పు, పంచదారలను సైతం పంపిణీ చేయాలి. ఈ ఏడాది జనవరి నుంచి కందిపప్పు సరఫరా లేదు. ఎప్పటికప్పుడు ఈ సారి కందిపప్పు ఇస్తున్నాం అంటూ కూటమి నేతలు ప్రచారం చేయడం తప్ప పేదలకు పంపిణీ చేసింది లేదు. ఎండీయూ వాహనాల ద్వారా కందిపప్పు ఇవ్వకపోవడంతో మార్కెట్‌లో కిలో కందిపప్పును రూ.150 వరకూ విక్రయిస్తున్నారు. అదే ప్రభుత్వం వాహనాలు ద్వారా సరఫరా చేసి ఉంటే రూ.67కే పేదలకు కిలో కందిపప్పు దక్కేది. అరకిలో పంచదార, కిలో కంది ఇప్పటికే గోధుమల పంపిణీ నిలిచిపోయింది.

మండలం	షాపులు	ట్రక్కులు	కార్డులు
మండపేట	64	34	43,029
రాయవరం	41	13	21,059
కపిలేశ్వరపురం	42	18	21,806
రామచంద్రపురం	58	24	34,420
కె.గంగవరం	43	15	20,602
కాజులూరు	45	15	22,821
మొత్తం	293	119	1,63,737

అంతా ప్రచారమే..



అన్నా క్యాంటీన్లతో అందరికీ అన్నం పెట్టేస్తున్నట్టు ఈ ప్రభుత్వం ప్రచారం చేసుకొంటుంది. వాస్తవానికి ప్రభుత్వానికి పేదలపై అంత ప్రేమే ఉండి ఉంటే నెల నెలా ఇచ్చే నిత్యావసరాలను పూర్తిగా పంపిణీ చేసేది. మరో పక్క పౌష్టికాహారం ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలంటూ ప్రచారాన్ని ఊదరగొడుతున్న ప్రభుత్వ, మాంసకృత్తులు, ప్రొటీన్లు పుష్కలంగా ఉండే కందిపప్పును పేదలకు ఎందుకు పంపిణీ చేయడం లేదన్నది చెప్పాలి.

– పాలింగి కృష్ణకిశోర్,
దళిత నేత, పడమర ఖండ్రిక

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

రాయవరం: తూర్పుగోదావరి జిల్లా వలంటరీ బ్లడ్ అండ్ ఐ డోనర్స్ క్లబ్ చైర్మన్ వెలగల ఫణికృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఫణికృష్ణారెడ్డి బుధవారం విలేకరులకు తెలిపారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు చెప్పారు. కాకినాడ కిరణ్ కంటి ఆస్పత్రి డాక్టర్లు రోగులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. స్థానిక, పరిసర గ్రామాల ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిబిరానికి వచ్చే వారు తెలుపు రంగు రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్, పాత రిపోర్టులు, ఫోన్ నంబర్ వెంట తీసుకుని రావాలని ఆయన సూచించారు.

ఘనంగా లక్ష్మీనరసింహుని చందనోత్సవం



చందాలవారిపేటలో చందన రూపుడైన వరాహ లక్ష్మీనరసింహస్వామి

కాజులూరు: ఆర్యావటం శివారు చందాలవారిపేటలో బుధవారం వరాహ లక్ష్మీనరసింహస్వామి (సింహాద్రి అప్పన్న) చందన వార్షికోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున ఐదు గంటల నుంచి స్వామి వారికి సంకల్పం, విష్వక్సేనారాధన, చందనం తొలగించుట, పంచామృత స్నపనం, అర్చన, బాలాభోగనివేదన, మంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ స్వామి వారి నిజరూప దర్శనం కల్పించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి చందన సమర్పణ చేసి స్వామి వారి తిరుకల్యాణోత్సవం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. నిర్వాహక కమిటీ సభ్యులు పరిసర గ్రామాల నుంచి స్వామి వారి దర్శనానికి వచ్చిన భక్తులకు తాగునీరు, అల్పాహారం తదితర వసతులతో పాటు ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటల నుంచి అన్నసమారాధన నిర్వహించారు.

విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన



వెల్లలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించిన మంత్రి సుభాష్

రామచంద్రపురం రూరల్: నియోజకవర్గంలో లో వోల్టేజ్ సమస్యను అధిగమించడానికి వెల్ల గ్రామం వద్ద నూతన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ వెల్లడించారు. బుధవారం మంత్రి వెల్లలో నూతనంగా నిర్మించదలచిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి శంకుస్థాపన చేశారు. మంత్రి మాట్లాడుతూ ద్రాక్షారామ ఉప విద్యుత్ కేంద్రం పరిధిలో వేసవిలో అధిక లోడ్ కారణంగా భారం పడుతుండడంతో లో వోల్టేజ్ సమస్యలు తలెత్తుతునాయన్నారు. లో వోల్టేజ్ సమస్యలను అధిగమించడానికి నూతనంగా వెల్ల గ్రామంలో రూ.3 కోట్ల 5 లక్షల 67 వేల రూపాయల అంచనాతో నూతనంగా 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాన్ని తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విద్యుత్ కేంద్రాన్ని నిర్మించడం వల్ల ద్రాక్షారామ విద్యుత్ ఉపకేంద్రంపై లోడు భారం తగ్గడంతో పాటు వెల్ల, వెల్ల సావరం, ఏరుపల్లి, హసన్‌బాద, ఉండూరు, బీకే పాలెం, ద్రాక్షారామ, కన్నడ తోట, ఆదివారపు పేట గ్రామాలకు నిరంతరం విద్యుత్ సరఫరాకు వీలవుతుందన్నారు. పనులు వేగవంతం చేసి విద్యుత్ ఉపకేంద్ర నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఈపీడీసీఎల్ ఎస్ఈ యడ్ల విజయానంద్, ఈఈ కె.రత్నారావు, డీఈఈ కె.మురళీమోహన్, ఏఈఈ వి.రమణారావు, రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని, ద్రాక్షారామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ద్రాక్షారామ మార్కెట్ యార్డు వద్ద వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న 14 పవర్ టిల్లర్లు, 3 రోటవేటర్‌లను బుధవారం రైతులకు మంత్రి సుభాష్ పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 80 పవర్ టిల్లర్లు 10 రోటవేటర్లను రాయితీపై అందించామన్నారు. వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీని వినియోగించుకుని ఎరువులు, పురుగుల మందులు చల్లడానికి రైతు గ్రూపులకు రూ.10 లక్షల విలువైన డ్రోన్‌ను రాయితీపై రూ.2 లక్షలకే అందజేస్తున్నామన్నారు. రానున్న మే నెలలో రామచంద్రపురం నియోజకవర్గంలో 8 డ్రోన్లను రాయితీపై అందిస్తామన్నారు. డ్రోన్లను ఆపరేట్ చేయడానికి రైతు గ్రూపులో ఒకరికి ఇప్పటికే శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం ద్రాక్షారామ గ్రామ సచివాలయం-2 లో బీసీ కార్పొరేషన్ ద్వారా నిర్వహిస్తున్న ఉచిత కుట్టుమెషీన్ శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు.

కూటమి ప్రభుత్వంలో పింఛన్ విధానం దారుణం



ఎమ్మార్పీఎస్ నేత జయరాజు

కపిలేశ్వరపురం (మండపేట): సామాజిక పింఛన్ల పంపిణీలో కూటమి ప్రభుత్వ విధానం దారుణంగా ఉందని, పింఛన్‌దారులను ఆందోళనకు గురి చేస్తోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ధూళి జయరాజు అన్నారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. పింఛన్ల పంపిణీలో ప్రభుత్వం తీసుకొంటున్న నిర్ణయాలు అస్పష్టంగా ఉంటున్నాయన్నారు. పెండింగ్ దరఖాస్తుదారులకు ప్రభుత్వం భరోసా ఇవ్వాలన్నారు. రెండు నెలలులోపు, లేదా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత భర్త చనిపోయిన వితంతువులకు మాత్రమే స్పౌజ్ పింఛన్లను ఇస్తామనడం దారుణమన్నారు. అర్హులైన అందరికీ పింఛన్లు మంజూరు చేస్తామంటూ ఎన్నికల్లో ఇచ్చిన హామీకి భిన్నంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



బత్తుల అప్పారావు

కె.గంగవరం: రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని మాజీ జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన కె.గంగవరంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు మేలు జరగడం లేదన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా తక్కువగా ఇస్తున్నారని రైతులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రకటించిన రూ.1725 ప్రకారం రైతులకు అందించాలన్నారు. కానీ మిల్లర్లు సన్నాలు మాత్రమే సీఎమ్మార్ ద్వారా కొని రైతులకు రూ.1725 అందిస్తున్నారని బొండాలు మాత్రం కొనుగోలు చేయడం లేదన్నారు. దళారులు బొండాలు కొని బస్తాకు రూ.250 తగ్గిస్తున్నారని ప్రభుత్వం జోక్యం చేసుకుని సీఎమ్మార్ ద్వారా బొండాలను కూడా ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కొనుగోలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నిరుపేద ఆటో కార్మికులకు ఇన్సూరెన్స్ చెల్లిస్తా..

రామచంద్రపురం: ఆటో కార్మికులు వ్యక్తిగత ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని, ఎవరైనా పేదరికంతో ఇన్సూరెన్స్ కట్టుకోలేని పరిస్థితిలో ఉంటే, వాళ్లకి తన తరఫున సగం ప్రీమియం చెల్లించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పష్టం చేశారు. పట్టణంలో ముందస్తు మేడే వేడుకలను బుధవారం నిర్వహించారు. ఆటో కార్మికులతో కలసి నిర్వహించిన ర్యాలీలో మంత్రి సుభాష్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మేడే రోజున అమరావతిలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొనవలసి ఉన్నందున నియోజకవర్గంలో ముందుగానే మే డేను కార్మికుల సమక్షంలో నిర్వహించినట్లు తెలిపారు. కార్మికుల కష్టంతోనే ఈ దేశ ఆర్థిక అభివృద్ధి ఆధారపడి ఉందన్నారు. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా, వారి భవితకు భద్రత కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం ఈ-శ్రమ్ కార్డుల ద్వారా బీమా కల్పిస్తుందన్నారు. అలాగే చంద్రన్నబీమా ద్వారా కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రిగా కాకుండా ఒక సాధారణ కార్మికుడిలా నిత్యం కార్మిక సంక్షేమానికి కట్టుబడి పని చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో పాల్గొన్న ఆటో యూనియన్ కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. పలువురు ఆటో కార్మికులను ఈ సందర్భంగా మంత్రి సన్మానించారు. అనంతరం జరిగిన విందులో కార్మికులతో కలిసి మంత్రి సహపంక్తి భోజనం చేశారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ నాగలక్ష్మి, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ విజయ్‌ప్రకాష్, పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షుడు కంచుమర్తి బాబురావు, పట్టణ టీడీపీ అధ్యక్షులు కడియాల రాఘవన్, కూటమి పార్టీ నాయకులు, పలువురు ఆటో యూనియన్ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుల నైపుణ్యాన్ని గుర్తించాలి

జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్



అంగర చేనేత సహకార సంఘంలో వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కపిలేశ్వరపురం: చేనేత కార్మికుల నైపుణ్యం, ప్రత్యేకతను ప్రతిఒక్కరూ గుర్తించాలని జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. అంగరలోని శ్రీగణపతి చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి, విక్రయ సంఘాన్ని బుధవారం ఆయన సందర్శించారు. సంఘం పరిధిలోని నేత కార్మికులతో మమేకమై వస్త్రాల తయారీ ప్రక్రియను ఆసక్తిగా పరిశీలించారు. వస్త్రాల తయారీ, వస్త్రాలను విక్రయించే మార్గాలపై సంఘం అధికారులను ఆరా తీశారు. నూలు కొనుగోలు, నిల్వ, కార్మికులకు అందజేయడం తదితర అంశాలపై సంఘం అధికారులకు పలు సూచనలు చేశారు. అంగర సారీస్ పేరుతో బ్రాండ్‌ను రూపొందించుకుంటూ విపత్కర పరిస్థితుల్లో సైతం సంఘం ఎదురొడ్డటంలో నేత కార్మికుల కృషి పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. రసాయన రహితమైన నేత వస్త్రాలు ఆరోగ్యకరమైనవే కాకుండా నాణ్యత, భారతీయ సంప్రదాయాల పరిరక్షణ తదితర అంశాలు ఇమిడి ఉన్నాయన్నారు. ఆయన వెంట చేనేత జౌళి శాఖ జిల్లా అధికారి పెద్దిరాజు, తహసీల్దార్ చిన్నారావు, ఎంపీడీఓ కార్యాలయ నిర్వహణాధికారి రాజేంద్రప్రసాద్, సహకార సంఘం ఇన్‌చార్జి కె.గంగరాజు ఉన్నారు.

ముమ్మరంగా వ్యవసాయ పనులు



కె.గంగవరంలో కోత కోస్తున్న కూలీలు

కె.గంగవరం: మండల వ్యాప్తంగా వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముందుగా పంట వేసుకున్న రైతులు ఎండలు కాయడంతో నేల ఆరుదల ఉన్న పంట పొలాల్లోని వరిని భద్రం చేసే పనిలో పడ్డారు. ఒకవైపు ఎంత తీవ్రతకు కూలీలు పనులు రాకపోవడంతో యంత్రాల ద్వారా వరి కోతలు చేస్తున్నారు. నేల ఇంకా ఆరని పంట పొలాల రైతులు కూలీలను బుజ్జగించి కూలీ రేట్లు పెంచి మరి వరి కోత కోయిస్తున్నారు. మరో రెండు, మూడు వారాలు వాతావరణం అనుకూలిస్తే ధాన్యం అమ్మకాలు పూర్తి అవుతాయని రైతులు ఆశతో ఉన్నారు. తొలకరిలో అకాల వర్షాల కారణంగా కొంత వరకు రైతులు నష్టపోయి ఆందోళన చెందారు. అయితే ప్రస్తుతం మాత్రం ఆనందంతో వ్యవసాయ పనులను ముమ్మరం చేశారు.

పెళ్లింట విషాదం

- శుభలేఖలు పంచడానికి వచ్చి తిరిగిరాని లోకాలకు..
- మర్రిబంద వద్ద రోడ్డు ప్రమాదంలో కోనసీమ జిల్లా వాసి దుర్మరణం



యలమంచిలి మండలం మర్రిబంద వద్ద బోల్తా పడిన స్కూటీ



ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన నక్కా వెంకటేష్

యలమంచిలి రూరల్ (అనకాపల్లి జిల్లా): మరో 15 రోజుల్లో పెళ్లి వేడుకలు జరగాల్సిన ఇంట్లో విషాదం అలుముకుంది. శుభలేఖలు పంచడానికి వెళ్లిన ఇంటి పెద్ద, బావమరిది రోడ్డు ప్రమాదానికి గురి కావడం, బావమరిదిని మృత్యువు కబళించడంతో సందడిగా ఉండాల్సిన ఆ ఇల్లు శోక సంద్రమైంది. వివరాలివి.. కోనసీమ జిల్లా రామచంద్రపురం రైస్‌పేటకు చెందిన స్వర్ణకారుడు నక్కా వెంకటేష్ (37), తన బావమరిది అనుపోజు చంద్రశేఖర్ (40)తో కలసి మే 15వ తేదీన జరగనున్న చంద్రశేఖర్ కుమార్తె వివాహ శుభలేఖలు పంచడానికి అనకాపల్లి వెళ్లారు. బంధువులకు శుభలేఖలు ఇచ్చి తిరిగి రామచంద్రపురం వస్తుండగా యలమంచిలి మండలం మర్రిబంద హైవే కూడలికి సమీపంలో వీరిద్దరూ ప్రయాణిస్తున్న స్కూటీ అదుపుతప్పి రోడ్డు పక్కగా ఉన్న ఇనుప రెయిలింగ్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో స్కూటీ వెనుక కూర్చున్న నక్కా వెంకటేష్ (37) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్కూటీ నడుపుతున్న చంద్రశేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడ్ని అంబులెన్సులో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతి చెందిన నక్కా వెంకటేష్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని బావ దిగుమర్తి వసంతరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు యలమంచిలి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదంలో దుర్మరణం పొందిన వెంకటేష్ కుటుంబసభ్యులు యలమంచిలి చేరుకుని మార్చురీలో భద్రపరచిన అతడి మృతదేహాన్ని చూసి బోరున విలపించారు.

పీహెచ్‌సీలో తనిఖీలు



పీహెచ్‌సీలో తనిఖీలు చేస్తున్న జిల్లా మలేరియా అధికారి వెంకటేశ్వర్

రాయవరం: మండలంలోని మాచవరం పీహెచ్‌సీని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వర్ బుధవారం తనిఖీ చేశారు. పీహెచ్‌సీకి వచ్చిన కేసుల వివరాలు, ల్యాబ్‌లో చేస్తున్న రక్త పరీక్షలను ఆయన పరిశీలించారు. ల్యాబ్‌ను సందర్శించి ల్యాబ్ టెక్నీషియన్ నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మాచవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి నిధులతో గ్రామాల అభివృద్ధి




వెదురుమూడి చెరువులో పూడికతీత పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం: కేంద్ర ప్రభుత్వ ఎన్ఆర్ఈజీఎస్ పథకం నిధులు గ్రామాల అభివృద్ధికి దోహదపడుతున్నాయని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. వెదురుమూడిలో అమృత సరోవర్ పథకంలో భాగంగా చెరువులో పూడికతీత పనులను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే గ్రామంలో మెరుగుపర్చిన రహదారిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఇక నుంచి ఉపాధి కూలీలను గ్రామీణ వికాస శ్రామికులుగా పిలవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి శారద, జేఈ సింగ్, ఫీల్డ్ అసిస్టెంట్ బోణం సత్తిబాబు, పుత్సల శ్రీనివాస్, చుండ్రు అచ్యుత రామారావు, బోణం నానిబాబు, ఇళ్ల రాంబాబు, అనుసూరి బూరయ్య పాల్గొన్నారు.

ఆంక్షలు సడలించాలని రైతుల నిరసన

- ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు
- తాటిపాక సెంటర్‌లో ధాన్యం లోడు ట్రాక్టర్లతో ఆందోళన



రైతులకు మద్దతు తెలిపిన మాజీ మంత్రి గొల్లపల్లి

రాజోలు: ధాన్యం కొనుగోళ్లు చేయడంలో ప్రభుత్వ ఆంక్షలు తొలగించాలని రైతులు తాటిపాక సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. బుధవారం ధాన్యం కొనుగోలు చేయడం లేదని ట్రాక్టర్ల ధాన్యంలోడుతో నాలుగు రోడ్ల కూడలిలో ఆందోళన చేపట్టారు. గ్రామాల వారీగా ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యాలను ఇచ్చి కొనుగోలు లక్ష్యం పూర్తయిపోయిందని, ప్రైవేటు వ్యాపారులకు, మిల్లర్లకు ధాన్యం అమ్ముకోవాలని వ్యవసాయ అధికారులు రైతులు చెబుతున్నారన్నారు. రైతులు చేపట్టిన ఆందోళనకు కౌలు రైతు సంఘం మద్దతు తెలిపింది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు రైతులు చేపట్టిన నిరసనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టించి ధాన్యం పండిస్తే దానిని కొనుగోలు చేయడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందన్నారు. ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు, దళారులు, రైస్ మిల్లర్లుకు అనుకూలంగా ప్రభుత్వం నిబంధనలు పెట్టి రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరకు రూ.150 తక్కువగా ప్రైవేటు వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయా లని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘ నాయకుడు పీతల రామచంద్రరావు మాట్లాడుతూ ప్ర భుత్వం ధాన్యం కొనుగోలు దళారీలకు అప్పగించవద్దని, ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. రైతులు గుబ్బల నాగరాజు, ఎంపీటీసీ జవ్వాది సత్తిబాబు, చిట్టూరి నాగరాజు, గూటం వెంకటేష్, కలిగితి రాజు, నక్కా సత్యనారాయణ, బొక్కా శ్రీరామ్మూర్తి, గంధం శ్రీను, గూటం రాజేష్, జిల్లెళ్ల శ్రీను, ఉల్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు విప్పర్తి బాబి, కలిగితి దిలీప్, నేదూరి ఈశ్వరరావు, దొంగ సత్యనారాయణ పాల్గొన్నారు.

పోలేరమ్మ జాతరకు శ్రీకారం



గరగలతో నృత్యం చేస్తున్న కళాకారులు

రాయవరం: మండలంలోని వెదురుపాకలో వేంచేసిన పోలేరమ్మ జాతరకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఏటా అమ్మవారి జాతరను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం పరిపాటి. దీనిలో భాగంగా ఆసాదులు గరగలు ఎత్తుకుని అమ్మవారికి గ్రామోత్సవం ప్రారంభించారు. వైశాఖ మాసం నెలపాడుపు రోజున అమ్మవారిని ఎత్తుకుని, పౌర్ణమి వెళ్లిన తర్వాత వచ్చే మంగళవారం తీర్థం జరిపించడం ఆనవాయితీగా వస్తున్నట్లు పోలేరమ్మ ఉత్సవ కమిటీ తెలిపింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి గరగలను దర్శించుకున్నారు.